

# రెక్కలు మొలిచిన గంధర్వులు

ముదిగొండ శివప్రసాద్

"శ్రీపురం ఎటు బాబూ!"

"అదుగో అ చెరువు కట్టలేదూ ఆదారంటే పడమరపు పోండి సామీ"

బస్సు దిగిన చోటునుండి పడమరకు నడక సాగించాను. బాట మొత్తమూ ముళ్ళతోనూ రాళ్ళతోనూ నిండివుంది. కొంతదూరం పోయేసరికి అదీ ఆగి పోయింది. అక్కడినుండి కేవలం పొలాల గట్లపై నడక. మెల్లగా చెరువుకట్ట ఎక్కాను. ఇటీవల వర్షాలకు చెరువులాగా నిండి ఒడ్డులను తంతున్నది. గట్ల సమీపంలో విపరీతంగా మొలిచిన తామరలూ, కావా, నీటిపూలూ నన్ను రసాత్మకమైన వాతావరణంలోకి తీసుకొనిపోయాయి. తాడికొండనుండి పరిమి వరకు కచ్చారోడ్డు మీద కుదుపుల బస్సులో నేను చేసిన ప్రయాణపు శ్రమను ఈ నీటిపై గాలి తొలగించివేసింది. సన్నగా ఈలవేస్తూ హుషారుగా శ్రీపురంకేసి నడిచాను.

చెరువుకట్ట దిగి చూద్దును ఓ కాలువ అడ్డంగా ప్రవహిస్తున్నది. అక్కడ ఒకరిద్దరు రైతులు ఒడ్డునే కూర్చుని ఏవో పిచ్చాపాటీ మాట్లాడుకొంటున్నారు. వాళ్లు నన్ను ఎగాదిగా చూచారు. మరీ చిన్న పల్లెటూళ్ళ వాతావరణం చాలా విచిత్రంగా వుంటుంది. ఎవరయినా కొత్తవ్యక్తి కనపడితే ఓపట్టాన వదలరు. పట్టి పట్టి చూస్తారు. ప్రశ్నల వర్షం కురిపిస్తారు. పక్కవాటాలో అద్దెకున్నవారితో కూడా సంబంధం లేకుండా — అంటే అంటనట్టు బ్రతికే బస్తీ వాతావరణం కన్నా ఇది

మిన్నగా వుండి మానవత్వమంటే ఏమిటో స్పష్టంగా చాటుతున్నప్పటికీ వాళ్ళు వేసే సవాలక్ష యక్షప్రశ్నలకు సమాధానం చెప్పడంకూడా ఒక్కొక్కప్పుడు కష్టమే - అందులోనూ నాబోటి మితభాషికి—

"ఎందాకా" ఓరైతు ఓరగా చూస్తూ ప్రశ్నించాడు కర్తా, కర్మ క్రియలూ గౌరవ సంబోధనలూ ఏమీలేని ప్రశ్న అది-"శ్రీపురందాకా" జవాబు చెప్పాను

"ఏవూరు మంది"

"తాడికొండ"

"ఎప్పుడూ చూచినట్లు లేదే"

'ఔను—నేనెప్పుడూ ఆవూళ్లోలేను. హైదరాబాదులో వుంటాను. మొన్ననే మా బంధువులను చూచిపోదామని వచ్చాను."

బస్తీనుంచి వచ్చాననే మాట వారిపై మంత్రదండలా పనిచేసింది. నోట్లోని చుట్టను కాలువలో పారేసి చేతులు కడుక్కొని చినిగిన పంచెకు తుడుచుకుంటూ "ఎవరింటికి వస్తున్నా రేంటిబాబూ ఇప్పుడు" అన్నాడు వినయంగా.

"రామయ్యగారింటికి" చెప్పాను.

"ఏరా రామయ్య ఊళ్ళోనే వున్నాడా"

"ఆఁ వున్నాడు వున్నాడు-పొద్దునే చూచినా' రెండవరైతు మొదటి వ్యక్తికి జవాబిచ్చాడు.

"ఉన్నాడు బాబూ ఉన్నాడు రామయ్య ఊళ్ళోనే—ఆడితో తమకు ఏం పని పడింది బాబూ."


"మాదొక నాలుగుకుంటల భూమి వుందిక్కడ పూర్వీకులది. అది అమ్మాలని ప్రయత్నం."

రైతులిద్దరూ తలలూపారు కొంచెం ఆగి "దానికి తమరింత దూరం రావాలా బాబూ ఆడినే 'మ్మంటే తాడికొండ వచ్చి మాటాడిపోయేవాడుగా" అన్నాడు. సూటిగా నిర్మొగమాటంగా సరైన లాయరులాగా క్లాస్ ఎగ్జామినేషన్ చేస్తున్నారు వీళ్ళు — నిజమే! ఎవరిద్వారా కబురుబెట్టినా రామయ్య బస్సుకోసంకూడా ఎదురుచూడకుండా నడుచుకుంటూనే తాడికొండ వచ్చి మాట్లాడిపోతాడు. కానీ రామయ్యను రమ్మనకుండా నేనే స్వయంగా శ్రీపురం బయలుదేరిన కారణం వేరు. అది వాళ్ళతో చెప్పనా? వద్దా ??—సరే, చెప్పేశాను.

"నేనెప్పుడూ శ్రీపురం చూడలేదు. అక్కడ అందమైన శిల్పాలున్నాయని విన్నాను. వాటిని చూద్దామనే కోరికతో స్వయంగా బయలుదేరాను — అందుకే బాగా పొద్దున్నప్పుడే వచ్చాను తాడికొండ నుంచి. ఇంతలో ఈ కాలువ అడ్డం వచ్చింది"

"కాలువదేముందిలే బాబూ మరో అర్ధగంటలో తీసిపోతుంది అరేయ్ గంగులూ ఏమున్నాయ్ రా, మనూళ్లో, శిలపాలు?"

"అదేనేహాఁ — ఆ దయ్యాల దిబ్బ పక్కన రాళ్ళులేవూ అవ్వే శిలపాలు—"



గంగులు సమాధానానికి రెండవ రైతు విరగబడి పొట్ట చెక్కలయ్యేటట్లు నవ్వాడు.

"మీ పేరేమన్నారు బాబూ.

"రావు."

"ఇదిగో రావుగారూ అక్కడో పాడు బడ్డ గుడి మాత్రం వుంది. అందులోవన్నీ విరిగిపోయిన బొమ్మలూ పగిలిపోయిన రాళ్ళూ—అంతే తప్ప మరేం లేవక్కడ కాస్త పొద్దు తిరిగితే చాలు ఎవ్వడూ ఆ దిక్కుకేపోరు. పగలే దయ్యాలూ పాములూ తిరుగుతుంటాయా గుళ్ళో— అవును గదరా గంగులూ."

గంగులు తల ఊపి దాన్ని బలపరచాడు ఔనన్నట్లు.

అయితే విన్నది అబద్ధమేనా?-అయినా ఇప్పుడేం ముంచుకు పోయింది. ఎటు తిరిగీ ఇంతదూరం రానే వచ్చాను కదా వెళ్ళి చూస్తే సరి—

"ఇదిగో బాబూ ఈ గంగులున్నాడే వీడి గుడిసె కాడనే వుందా దోవ— ఈ గుడిసె పక్కనుంచీ నేరుగాపోయి తుమ్మ తోపు దాటితే సరి—అదే గుడి. పూర్వమది నీలకంఠ స్వాములవారి గుడిట— ఇప్పుడాడ మా గొడ్లకాడి పిల్లలు ఆడుకుంటుంటారు."

నేనూ అదే విన్నాను. పూర్వం బౌద్ధమూ శైవమూ కృష్ణాతీరంలో వైభవోపేతంగా ఉన్నప్పుడు బృహత్పలాయనులో లేక శాలంకాయనులో ఈ శ్రీపుర నీలకంఠేశ్వర దేవాలయం నిర్మించినట్లు తెలిపింది. తర్వాత మత సంఘర్షణలలోనూ విదేశీయ దండ యాత్రలలోనూ ఆ వైభవం అంతరించి

పోయి చివరకు ఆ పేరుగల గ్రామం ఒకటి ఉన్నదన్న విషయం కూడా ఎవ్వరికీ తెలియకుండా పోయింది.

కాలువ అనుకున్నంత త్వరగా తీయ లేదు దానితో సూర్యాస్తమయానికి పూర్వమే తిరిగి తాడికొండ చేరుకోలేనని భయం కలిగింది. ఇక ఈ రాత్రికి యీ వూళ్ళో చిక్కుబడి పోయేటట్లున్నాను.

"పైన యాడో వర్షాలుపడి ఈ కాలువ ముంచుకొచ్చింది కాని లేకుంటే ఈ పాటికల్లా ఎప్పుడో ఊళ్లో పడేవాళ్ళం కదరా గంగులూ. ఔనన్నట్లు గంగులు బుర్ర ఊపుతున్నాడు.

నేనేం మాట్లాడకుండా గంభీరంగా వున్నాను—

"మీరేం బెంగపెట్టుకోకండి బాబూ— రాతిరి మా ఇళ్ళల్లో ఎక్కడైనా ఉండొచ్చు సుకంగా—పొద్దున్నే పరిమిదాకా వచ్చారంటే మంగళగిరి నుంచి పరిమిమీదుగా తాడికొండకుపోయే ఫస్టు బస్సులో ఓ అరగంటలో ఇల్లు చేరుతారు తిరిగి—ఔను గదరా.

"ఔనౌను" గంగులు బసవన్నగా డూడూమంటూ ఊపుతున్నాడు తల. వాళ్ళ గుడిసెల్లో నేను ఉన్నా ఉండక పోయినా అతిథి మర్యాద సూచకమైన ఆ మాటలకూ ఆదరణకూ పరవశించి పోయాను. సాటి మానవుడు చచ్చి ఫుట్‌పాత్‌మీద పడివుంటే శవంమీది నుంచి దాటి శరవేగంతో సికిందరాబాదు పెరేడ్ గ్రౌండ్స్ దగ్గరి నైట్ క్లబ్‌లకూ సాగిపోయే ఆ మనుషులెక్కడ?? స్వచ్ఛమైన స్ఫాటిక నిర్మలమైన అమాయికమైన ఈ మనుష లెక్కడ??

"నీలకంఠేశ్వరా కనీసం మా పల్లెటూళ్ళనన్నా పవిత్రంగా కాపాడు" అని ప్రార్థించాను మనస్సులో

కాలువ తీసింది క్రమంగా—

మొదటి రైతు సాహసించి ముల్లు కర్రతో నీళ్ళల్లోకిదిగి లోతు చూచి "అం రాండిబాబూ దాటొచ్చు కాలువ—అరేయ్ గంగులూ- ఆర్నితీసుకోనిరా" అన్నాడు. నేను గంగుల్ని అనుసరించాము గంగులు నా చేయిపట్టుకొని కాలువ దాటించాడు తేలికగానే—

అవతలిగట్టు చేరగానే చకచక నడక సాగించాము. సూర్యుని అరుణారుణకిరణ చ్ఛాయతో ప్రకృతి మొత్తం కుంకుమ పూవు పండినట్లు కన్పిస్తున్నది—దూరంగా గొడ్లు కాచే పిల్లలకేకలు ఆకాశంలో, కృష్ణానది మీదినుంచీ వస్తున్న బారులు తీరిన జలపక్షుల మధుర ధ్వనులు దారి పక్క తుమ్మ చెట్లకు అపూర్వమైన కళాప్రౌఢితో అల్లిన గిజిగాడి గూళ్ళు—

"బాబూ వచ్చాము వూళ్ళోకి" మొదటి రైతుమాట నన్ను వాస్తవలోకంలోకి తెచ్చింది—

"నేను సెలవు తీసుకుంటాను బాబూ- అరేయ్ గంగులూ ఈరిని రామయ్యా ఇంటికి తీసికెళ్లు—ఎంఃరేపు దగ్గరుండి

మవ్వే ఈరికి శిలపాలు చూపించి పరిమి దాకా తోడెళ్ళి బస్సెక్కించి షరీరా—''

గంగులు తల పూపాడు — మొదటి రైతు వెళ్ళిపోయాడు నేను గంగులు వెనకనే బయలుదేరాను దోవలో తొక్కుడుబిళ్ళ ఆడుతున్న చిన్నపిల్లలు ఈ కొత్తముఖాన్ని చూచి విచిత్రంగా ముఖభంగిమలు మార్చారు.

"రేయ్ బుడ్డోడా! అయ్యున్నాడా ఇంటో ' గంగులు కేక వేసినట్లు ప్రశ్నించాడు.

''ఆఁ—ఉన్నాడు అంటూ ఆపిల్లల మధ్యనుండి ఓ చిన్నబ్బాయి' అయ్యోయ్'' అని కేక వేస్తూ పరుగెత్తాడు రివ్వున పిచ్చుకలాగా—

మేము రామయ్య ఇంటికి చేరేలోపలే పిల్లవాడు ద్వారా కబురందిన రామయ్య పరుగెత్తుకుంటూ మాకు ఎదురొచ్చాడు నన్ను చూడగానే పోల్చుకున్నాడు—

''మీరాబాబూ '' అని మాత్రం అన్నాడు భయంగా ఆశ్చర్యంగా ..

'అవును రామయ్యా ఆఁ—అంతా కులాసా—''

''ఆఁ—వున్నాం బాబూ మీ దయ వల్ల-చానా సంతోషం బాబూ. ఎన్నాళ్ళ యిందో మిమ్మల్ని సూసి. ఏమేయ్ ఎవ రొచ్చారో చూడు '' రామయ్య ఆర్భాట పడుతున్నాడు—నేను నవ్వుతూ వాళ్ళ ఆప్యాయతను అనుభవిస్తున్నాను—

గంగులు మంచం వాల్చాడు—కూర్చు న్నాను.

రామయ్య మంచినీళ్ళు ఇచ్చాడు— తాగాను.

''కూసింత మజ్జిగ ఇమ్మంటారా బాబూ '

వద్దన్నాను—

చేతులు కట్టుకొని కిందనే గంగులూ రామయ్య కూర్చున్నారు. "ఎప్పు దొచ్చి నారు బాబూ బస్తీనుంచి"

''మొన్న రామయ్యా—మళ్ళీ రేపే తాడికొండనుండి గుంటూరు పోయి అక్కడిపని చూసుకొని హైదరాబాదు వెళ్ళిపోతాను—''

''కాకిచేత కబురంపితే రెక్కలు కట్టు కొనివచ్చి వాలుందునుకదా బాబూ''

''కాదులే రామయ్యా-నేనేమిమ్మల్నీ మీ వూరునూ స్వయంగా చూద్దామని వచ్చాను- ఈ కాలువ వొకటి అడ్డం వచ్చి ఆలస్య మైపోయింది-లేకుంటే ఈపాటికి మళ్ళీ తిరిగిపోదామనుకున్నాను—''

రామయ్య నొచ్చుకున్నాడు చాలా—

''ఆపాటి గౌరవం ఒక్కరేతిరి మేం చెయ్యలేమనే అనుకున్నారా బాబూ''

''అదికాదు రామయ్యా ''

"కాదేమిటి బాబూ—మీరియ్యాళ మా పల్లెలో బోంచేయాల్సిందే ''

''అక్కర్లేదు రామయ్యా—ఓగ్లాసెడు పాలిప్పించు చాలు—''

రామయ్య దీనికి తన బాధనంతా వ్యక్తంచేస్తూ అదోరకంగా ముఖం పెట్టే

సరికి నేనిక మారు మాట్లాడలేకపోయాను.

'మీరు కాదనకండిబాబూ—మామీద ఒట్టే—''

''సరే రామయ్యా-నీ యిష్టం వచ్చి నట్లే చెయ్యి.''

ఎగిరిగంతేశాడు రామయ్య - ఇంట్లోకి వెళ్ళి భార్యకు వండవలసిన వాటి వివరాలు చెప్పి, పని పురమాయించి మళ్ళీవచ్చాడు. ఓ పదినిమిషాలు తన పరిస్థితిని గూర్చి పొలం స్థితిగతుల గూర్చీ వివరించాడు. ఆ తర్వాత నేను బేరం పెట్టదలచిన పొలం విషయం ప్రస్తావించాను. దానిని గూర్చి కొంచెంసేపు చర్చ జరిగింది ఎక్కువోతక్కువో ఇన్నాళ్ళనుంచి కౌలుకు చేసుకొంటున్న పొలం తానే కొంటా నన్నాడు రామయ్య నాకుకూడా అదే ఉచితమనిపించింది. అంతటితో ప్రసక్తి ముగిసింది. నేను వచ్చిన పనిలో సగం అయిపోయింది.

గంగులు నమస్కారం పెట్టి లేచి నిల బడ్డాడు. పొద్దున్నే వచ్చి దర్శనం చేసు కుంటా నన్నాడు రామయ్య కూడా ఊళ్లోకి పోయినాడు. నన్ను విశ్రాంతి తీసుకోమనికోరి-

నిర్మలంగా వున్న ఆకాశమనే సరో వరంలోకి చంద్రుడు రాజహంసలా ప్రవే శించాడు-పట్టుమని పదిపదుల ఇళ్ళుకూడా లేని ఆ కుగ్రామంలో పొలాలలోని మిణు గురు పురుగులతో స్పర్థకా అన్నట్లు చిన్న చిన్న దీపాలు వెలిగాయి. నిరంతరం బస్సుల రొదలకూ ఫాక్టరీ ఘూంకారధ్వను లకూ అలవాటుపడ్డ నన్ను నిశ్శబ్దమైన ఈ వాతావరణం ఏదో గంధర్వలోకాలకు నడి పించినట్లనిపించింది లోపల రామయ్య భార్య వంట చేస్తున్నది. పిల్లలు దీపాలు పెట్టీపెట్టకముందే నిద్రపోయారు గుమ్మం దగ్గర నాకోసం ఓ వెలిగించిన హరికెన్ లాంతరు పెట్టారు ఒకటి రెండు అరకలు మాత్రం ఆత్రోవ వెంట గృహోన్ముఖమై సాగాయి- నందీశ్వరునికి సతీర్థులా అన్న ట్లున్న ఆ వృషభరాజాలు వెన్నెలలో మరింత తెల్లగా మెరిసిపోతూ, గంటల గలగలలో సాగిపోయాయి - ఎదురుగా వున్న ఎత్తయిన వేపచెట్టు కొమ్మలపై విశ్రమిస్తున్న కొక్కెరలు వెన్నెల పువ్వులవలె విరిశాయి వెన్నముద్దలవలె మెరిశాయి ఈ విచిత్ర నిశ్శబ్దవాతావర ణంలో నాలో ఏదో భావస్పందన ప్రారంభ మైంది. దూరాన ఎవరో సన్నగా వీణా వాదనం చేస్తూ నన్ను పిలచినట్లనిపిం చింది. ఎవరో అప్సరసలు తమచే లాంచ లాలు జారుస్తూ అంబరం చుంబిస్తూ నన్ను దూరంగా ఆహ్వానిస్తున్నట్లు అనిపించింది -అప్పుడు-ఉన్నట్టుండి నేను చటాలున మంచంపైనుండి లేచాను. జోళ్ళు తొడు క్కొని హరికేన్‌లాంతరు చేతపట్టుకొని తుమ్మతోపుకు అభిముఖంగా నడక సాగిం చాను. నాలోని ఏదో తెలియని ఒక బల మైన శక్తి నన్నలా నీలకంఠేశ్వరాలయా నికి నడిపించింది. నిశ్శబ్దమైన ఈ వెన్నెల




రాత్రిలో నరులెవరూ లేకుండా ఈ కిన్నరులున్న ప్రాంతాన్ని సందర్శించాలనే ఒక గాఢమైన కోరిక ఈ ప్రయాణానికి కారణం కావచ్చు! తుమ్మతోపు దాటాను. మనిషి అలికిడికి అక్కడి చెట్లపై పడుకున్న పక్షులు కొన్ని ధ్వనిచేస్తూ ఒక్కసారి పైకి లేచాయి ఆ కలవరమూ కలకలమూ కూడా నకు కలవరంగానే విన్పించింది-మరికొంచెం ముందుకు సాగాను అలాగే-

అదే, కనుచూపు దూరంలో వెన్నెలలో స్నానంచేస్తున్న నీలకంఠేశ్వరుని శిథిలాలయం !

చకచకా నడుస్తూ ఆలయాన్ని సమీపించాను. లాంతరు వెలుగును కొంచెం పెద్దఃచేసి పైకెత్తి పట్టుకొని పరిశీలించ సాగాను

ఆలయం బాగా శిథిలమైపోయింది. ముందున్న మంటపం దాదాపు కూలిపోయే వుందని చెప్పవచ్చు ఆలయానికి చెందిన పద్మాకారపు శిల్పాలుకల పెద్దపెద్ద రాళ్ళు అక్కడక్కడా చెల్లాచెదరుగా పడి ఉన్నాయి. రెండుమూడు దేవతామూర్తులు కూడా స్థానభ్రంశంచెంది త్రోవలో నిర్లక్ష్యంగా పారేయబడ్డట్లున్నాయి. మసక వెలుతురులో ఆ శిల్పాలూ వాటి సున్నితమైన నగిషీపనీ సందర్శించే అవకాశం లేకపోయింది కాని తొలి చూపులోనే ఇది ఒకనాడు అజంతా ఎల్లోరా శిల్ప సౌందర్యానికేమి తీసిపోనట్టి కళా సౌందర్యంగా శోభించి ఉండేదని తేలికగానే గ్రహించగలిగాను. ఆలయానికి ముందు భాగంలో రెండు గంధర్వుల శిల్పాలున్నాయి వాటి రెక్కలూ కాళ్ళూ కూడా శిథిలమైపోయాయి. అయినప్పటికీ వెన్నెల

వెలుగులో ఆ రెండు మూర్తులూ ధగధగ మని మెరిసిపోతున్నాయి. సమీపానికి వెళ్ళి చేతిలో స్పృశించి చూశాను. ఒక్కసారిగా ఏదో విద్యుత్తునాలో ప్రవహించి నట్లనిపించింది. ఎవరో నన్నొక్కసారి అటూ ఇటూ ఊపినట్లనిపించింది ఉలిక్కిపడి చుట్టూ చూచాను—

ఎవరూ లేరూ.

ఎటుచూచినా నిశ్శబ్దమే—దూరంగా కీచురాళ్ళ ధ్వని. నాలో నేనే నవ్వుకొని దీపాన్ని తగ్గించి సమీపంలోని ఓ బండపై కూర్చున్నాను మౌనంగా—

చాలా దూరంగా కృష్ణానది ప్రవహిస్తున్న సన్నని హోరు—

ఏనాటి దేవాలయమో యిది??

ఎప్పటి కళాసంపద యిది .

ఆనందగోత్రీకులైన యే దామోదర వర్మకాలంలోనో బుద్ధ్యాంకురుని కాలం లోనో ఇది ధూపదీపాదులతో భూలోక కైలాసంగా శోభిల్లి ఉండవచ్చు. ఏ బృహత్పలాయనుల నాడో లేక వెలనాటి చోడుల కాలంలోనో దీని ప్రభ విదేశాలకు పాకి ఉండవచ్చు మల్లవర్మ అనే రాజు ధాన్యకటకాన్ని రాజధానిగా చేసుకుని పరిపాలించాడట. అదే ధనదపురమని పిలువబడేదనీ, చివరికి ప్రస్తుతం దాన్నే అమరావతి అని పిలుస్తున్నారనీ నే నెప్పుడో చదివినట్లు జ్ఞాపకం—

ఈ శ్రీపురానికి పదిమైళ్ళ దూరంలోనే పశ్చిమాన అమరావతి ఉంది. ఉత్తరాన కృష్ణవేణమ్మ—కాబట్టి ఇది చారిత్రకమైన ప్రదేశమే అయివుండవచ్చు.

దీని ఘనత తిరిగి ప్రపంచం గుర్తిస్తుందా?

ఆనాటి శోభ ఈ నాడు మళ్ళీ వస్తుందా??


ఈ గంధర్వులకు రెక్కలు మొలిచి ప్రాచీ, ప్రాచీన, కళావైభవం విదేశాలకు చాటుతూ ఎగిరితే ఎలావుంటుందో?? వేల కొలది శిల్పుల యుగయుగాల తపస్సు పండి ఫలించిన యిలాంటి దేవాలయాలు తెలుగుదేశంలో వున్నాయని మనవాళ్ళు ఎప్పుడు గుర్తిస్తారు? ఎన్నడు కీర్తిస్తారు??

గట్టిగా నిట్టూర్చాను నేను—నా ఓర్పు నాకే స్పష్టంగా వినిపించేటంత నిశ్శబ్దం—చంద్రుడనే పుష్పంనుంచి వెన్నెల పొడి పొడిగా పుప్పొడిగా కుప్పలుగా రాలుతున్నది ఆలయం లోపలనుంచి ఎవరో అప్సరస నన్ను రమ్మని పిలుస్తున్నది. ఎన్నడూ వినని ఏదో నన్నని అమర గాంధర్వం ఎప్పటిదో ఎక్కడిదో మరి. దేశాన్నీ కాలాన్నీ చీల్చుకొని వచ్చి నన్ను తాకుతున్నది లాంతరు తీసుకొని గుడిలోపలికి వెళ్దామని లేవబోయాను

జరజరమనిపాకుతూ ఓ శిధిల స్తంభం కిందికిపోతున్న నల్లని త్రాచుపాము—

భయంతో రెండడుగులు వెనక్కివేశాను—

మంటపానికి వ్రేలాడుతున్న గబ్బిలాలు ఒక్కసారి 'గీ'మని ధ్వనిచేస్తూ




వలుదిక్కులకూ ఎగిరాయి—

ఏదో అడుగులచప్పుడు—

స్తంభించిన ఊపిరితో తల పైకెత్తి చూచాను—

నల్లగా కదులుతున్న రెండు మానవాకారాలు—

కొయ్యబారిపోయాను—

చేతిలో లాంతరు జారిపడింది!

"బాబూ!"

"ఎవరు?' అన్నాను కాని—గొంతులోనుండి ధ్వని బయటికేరాలేదు.

'ఏమిటిబాబూ చీకట్లో యిట్టాఒక్కరే వచ్చారు?"

"ఎవరూ రామయ్యా??"

"అవును బాబూ మేమే—"

రామయ్య—గంగులూ!!

"పగలుపూటే మే మీ దిక్కుకురామే మీ రింతరేతిరికాడ ఎందుకు వచ్చారిటు "

"ఆఁ—ఏమీలేదు రామయ్యా—గుడి చూద్దామని—"భయం వదలగా మెల్లగా శ్వాస తీసుకుంటూ అన్నాను.

"వద్దు బాబూ—పురుగూ పుట్రా తిరుగుతుంటాయి - అర్ధరేతిరప్పుడు ఇక్కడ దయ్యాలు కూడా వుంటాయి బాబూ కొరివులు పుచ్చుకోని—" లాంతరు తన చేతిలోకి తీసుకున్నాడు గంగులు.

నేను మాట్లాడకుండా వారిని అనుసరించాను.

రామయ్య ఏదో మాట్లాడుతున్నాడు కాని నా చెవులు పనిచేయడంలేదు. యాంత్రికంగా నడుస్తూ ముందుకు

వరణం నుంచీ తేరుకోనేలేదు-

రామయ్య తనకున్న పరిధిలో చాలా చక్కని భోజనాన్నే ఏర్పాటుచేశాడు. అప్పడాలూ, వడియాలూ, మిరపపండ్లు వేసి నూరిన రేగిపచ్చడీ ఆవకాయా- జిహ్వ లేచివచ్చినట్లనిపించింది-రామయ్యా ఆయన భార్యా చూపిన ఆప్యాయత నాకంతకన్నా ఎక్కువ ఆనందాన్ని కలుగజేసింది. గట్టి గడ్డపెరుగు వడ్డిస్తూ అన్నాడు రామయ్య "పొలం నేనే కొంటాను బాబూ, వచ్చే ఉగాదిదాకా గడువివ్వం చండి-

రాత్రిపూట పెరుగు మంచిది కాక పోయినా రామయ్య ప్రేమను కాదనలేక పోయాను "అలాగే రామయ్యా - రేపు నాతోబాటు పొద్దున్నే తాడికొండరా - అక్కడ అడ్వాన్సు ఇచ్చి కొనుగోలు బేరం ఖరారు చేసుకొని వెళ్దువు. సాక్షి సంతకాలతో కాగితం ఇప్పిస్తాను."


రామయ్య నవ్వాడు "మీమాట చాలదా బాబూ-వేరే కాగితాలు ఎందుకు నాకు-"

భోజనానంతరం, ఆరుబయటే వెన్నెలలో మంచంపై పడుకున్నాను-చూస్తూండగానే అంతా నిద్రపోయారు-కాని కొత్త ప్రదేశం కావడంవల్లనో ఇందాకటి గంధర్వశిల్పాలు జ్ఞప్తికి రావడంవల్లనో నాకుమాత్రం ఓ పట్టాన నిద్రరాలేదు అలాగే కళ్లుమూసుకొని పడుకున్నాను—— ఎప్పటికో మగతనిద్ర పట్టింది

ఆ నిద్రలో కల - శ్రిపురంచుట్టూ జనం గుమిగూడుతున్నట్లు —— ప్రజలూ పత్రికలూ ఆ కళాఖండాలను ప్రశంసిస్తున్నట్లు గంధర్వ శిల్పాలు రెక్కలతో ఎగురుతున్నట్లు దేవాలయంలో నీలకంఠేశ్వరునిముందు ఎవరో విష్ణుకూడిన చక్రవర్తి తన సతీమణితో కలిసి పూజలు చేస్తున్నట్లు దేవదాసీలు దీపనృత్యాలలో వలయాకారంగా తిరుగుతున్నట్లు .

మెలకువ వచ్చింది——

గంగులు పిలుపుతో లేచి చూశాను— తెల్లవారింది త్వరత్వరగా కాలకృత్యాలు నిర్వహించుకొని రామయ్య గంగులూ వెంటరాగా తిరుగు ప్రయాణానికి బయలు దేరాను గంగులు శ్రద్ధగా అన్నీ చూపించాడు అక్కడ చాలా విలువైన శిలాశాసనాలు కూడా ఉన్నాయి. ఎవ్వరూ జాగ్రత్త వహించక పోవడంవల్ల వాటి లిపి చాలా భాగం చెరిగిపోయింది కొన్ని శిల్పాలు మట్టిలో కూరుకుపోయాయి. కొన్ని మూర్తులు, గేదెలూ ఆవులూ కండూతితో ఒరుసుకోవడంవల్ల అరిగి పోయాయి లేదా శిధిలమైనాయి కొన్ని చక్కని శిల్పాలు గల రాతి స్తంభాలను రైతులు పొలం పక్కన గల నేల బావి నుండి నీరు తోడుకునేందుకుగాను ఉచితంగా వాడుకున్నారు. మరికొన్ని అరుదైన స్తంభాలను ముక్కలుగాచేసి పునాది రాళ్ళుగానూ, మట్టిగోడల మధ్య బండ రాళ్ళుగానూ ఉపయోగించుకున్నారు




సమీపంలోని గుడిసెల వాళ్లు.

సూర్యుడు కొంచెం పైకి వచ్చిన తర్వాత నా వెంటవున్న కెమేరాతో కొన్ని ఫొటోలు తీసుకున్నాను. ఈ గుడిని పున రుద్ధరించవలసిందనీ శిల్పాలను జాగ్రత్తగా చూసుకోవలసిందనీ వారికి నేను సలహాయిచ్చాను నా మాట కాదనడం యిష్టంలేక కబోలు వారు 'సరే'నన్నట్లు తలవూపారు. మంటపంపక్కనే పడేసి ఉన్న ఓ విగ్రహం చూపించి"గంగయ్యా యిదిగో యిదే అమ్మవారి విగ్రహమై ఉంటుంది చూడు ఎంత కళగా వుందో— వాటినన్నిటినీ పదిలపరచండి. ఎప్పటికైనా మంచిరోజు రాకపోదు—అమ్మవారి మహిమలోకానికి వెల్లడికాకపోదు" అని చెప్పాను. వాళ్ళు అలాగేనని అంగీకరించారు. గంగులుకు ఓ రూపాయి యివ్వబోయాను ఎంతో మొగమాటపడి చివరకు నా బలవంతాన్ని తప్పించుకోలేక తీసుకున్నాడు

"గంగయ్యా యింక ఆగిపో వెళ్ళి వస్తాము" అన్నాను కాలువదగ్గర. అయినా వినిపించుకోలేదు. పరిమిదాకా వచ్చి మిమ్మల్ని బస్సెక్కించి మరీ వెనక్కి తిరిగాడు సంతృప్తిగా—తాడికొండ రాగానే పొలం అమ్మకం పని ఖరారుచేసి మధ్యాహ్నాని కల్లానే రామయ్యకు కాగితాలు ఇచ్చి పంపివేశాను ఆ రోజు సాయంత్రమే గుంటూరు చేరుకొని మర్నాటికల్లా హైదరాబాదు వచ్చేశాను. వెంటనే ఫొటోలన్నీ డెవలప్ చేయించాను. దాదాపు అన్నీ, చక్కగావచ్చాయి. తర్వాత తీరిక చూచుకొని ఒకరోజు "శ్రీపురం-శిల్పసంపద అని ఒక వ్యాసం

ఆంగ్లంలో వ్రాసి ఫొటోలతో సహా ఒక ఆంగ్లపత్రికకు పంపించాను. వారివద్ద నుండి నాకు వెంటనే ప్రచురించుకొన్నట్లు జాబు వచ్చింది. ఒకనెల రోజులలోనే ముద్రితమైన వ్యాసం ప్రతులు నాకు వాళ్లు పంపించారు. అంతటితో నేను సంతోష పడ్డాను. తిరిగి నా నిత్యజీవిత వ్యవహారా లలో మునిగిపోయి ఈ శ్రీపురం గూర్చి మరింక తర్వాత ఆలోచించనేలేదు.

కొన్నాళ్ళ తర్వాత తాడికొండలోని బంధువు లొకరికి జాబువ్రాస్తూ మాపొలం గూర్చి, శ్రీపురం గూర్చి ప్రసక్తంచేశాను ఒకవారం రోజులలో హనుమంతరావు అనే మా బంధువు తిరిగి జవాబు వ్రాశాడు

"శ్రీయుతులు రావుగారికి నమస్కా రములు మీరు చెప్పిన పనులన్నీ మేము ఇక్కడ చేయగలము—కాగా మీరు శ్రీపురం గూర్చి వాశారు. అసలు నేనే దాన్ని గూర్చి వ్రాయాలని కొద్దిరోజులుగా అనుకుంటున్నాను. ఆ నీలకంఠేశ్వరాల యంలో ఒక అమ్మవారి విగ్రహం వుందట దానిని గంగులు అనే ఓ రైతు కొద్దికాలంనుంచీ ఉపాసిస్తున్నాడట ఆ ఉపాసనాబలలవల్ల ఆతనికి దివ్యశక్తులు కొన్ని వచ్చినట్లు వింటున్నాము ఎవరేది కోరితే అమ్మవారు ఆ వరం ఇస్తున్నదట శ్రీపురంలో - కాగా మీరైతు రామయ్య మిమ్మల్ని పొలం రిజిష్ట్రేషన్‌కు రమ్మని కబురుపెట్టాడు. వేసవిదాకా ఆగ నవసరం లేదట—"శ్రీపురం-శిల్పసంపద" అన్న మీ ఆంగ్లవ్యాసం చాలా బాగుంది. అందులో శిల్పమూర్తుల శిఖావ్యాలము, పిండాపత్రము, శిరశ్చోలకములను అమరా వతి శిల్పమూర్తులతో పోలుస్తూ మీరుచేసిన వర్ణన మిక్కిలి ఆసక్తికరంగా వుంది— సాధ్యమైనంత త్వరలో మీరు తాడికొండ వస్తే మంచిది—వందనములతో భవ దీయుడు—హనుమంతరావు"

ఆ ఉత్తరం చదివి ఆశ్చర్యపోయాను. నేను ఊహించినట్లు ఆ విగ్రహంలో అంతటి మహత్తరశక్తి వుందన్నమాటః దానిని తొలిసారిగా ప్రపంచానికి చాటిన ఘనత నాకే దక్కినందుకు నేనెంతో గర్వ పడ్డాను వారం పదిరోజులలోనే వీలుచూచు కొని మళ్ళీ తాడికొండ వెళ్ళాను—హను మంత ఆదరించాడు. అవీ ఇవీ మాట్లాడు కున్న తర్వాత శ్రీపురం ప్రసక్తి వచ్చింది.

"రావుగారూ మీ ఆంగ్లవ్యాసం చాలా బాగుంది దానికి మెచ్చుకుంటూ కొందరు సంపాదకునికి లేఖలు కూడా వ్రాశారు. చూశారా—"

"అవును—నాకు కూడా వ్యక్తి గతంగా కొన్ని జాబులు వచ్చాయి"

అన్నాను హనుమంతరావు ఇంకేమి చెపుతాడో వినాలన్న ఆసక్తితో.

ఆయనఅన్నాడు'మీరేముహూర్తాన వెళ్ళి ఆ శ్రీపురం శిల్పాలను తాకివచ్చారో కాని నాటినుండి వాటికి మంచిపేరు వస్తున్నది. అమరావతి, ధరణి కోట చూడడానికి వచ్చే వాళ్ళంతా "శ్రీపురం" ఎక్కడ అని

అడిగి మన వూరుమీదుగుండా నడిచివెళ్ళి ఆ శిల్పాలు చూచివస్తున్నారు. యాత్రికులు కొందరు కనకదుర్గను చూచి పడవ మీద అలాగే కృష్ణానది ఎగువకు ప్రయాణం చేసి శ్రీపురం చూస్తున్నట్లుకూడా వార్తలు వస్తున్నాయి. దీనిని వెలుగులోకి తెచ్చిన ఘనత కేవలం మీకు దక్కుతుంది''

హనుమంతరావు అలా అంటుంటే నాకు కొంచెం గర్వం కలిగిన మాట నిజమే—అయినా మాటవరస కిలా అన్నాను "అందులో నా గొప్పతనం ఏముంది? ఆ శిల్పాలు మొదలే, పేటికాంతర్గతరత్నాలు, వాటిని కేవలం పదిమంది దృష్టికితెచ్చానంతే నేను మరి గంగులు సంగతేమిటో వ్రాశారు—''

''ఆఁ—ఆ విచిత్రం మరీ గొప్పది మీరు వినితీరాలి—గంగులని అక్కడో బికారిగాడున్నాడు. వాడికి సెంటు పొలం లేదు. దమ్మిడీ ఆదాయంలేదు శ్రీపురం నుంచి తాడికొండకూ మంగళగిరికీ మూటలు మోస్తూ తిరుగుతుండేవాడు పూర్వం-కాగా ఇటీవల వాడా దేవాలయంలోని అమ్మవారిని ఉపాసిస్తున్నాడట—వాడు ఎప్పుడు పలకమంటే అప్పుడుపలుకుతుందిట దేవి ''

నమ్మలేకపోయాను 'నిజంగానా?'' అనిమాత్రం అన్నాను "అని మెల్లగా అడుగుతారేమండీ—ఇప్పుడు గ్రామానికి వాడే మకుటంలేని రాజు—రామయ్యా దగ్గరినుంచీ అందరూ వాడికి ప్రతిరోజూ ఉదయం పాదపూజ చేయవలసిందే—తనకువచ్చిన భక్తులకు కొందరికి గంగులు తీర్థమూ విభూతీ ఇస్తాడట ఆ విభూతి నొసట పెట్టుకుంటే చాలు ఎవరే కోరిక కోరుకున్నా వెంటనే నెరవేరుతున్నదట—రామయ్యమటుకు రామయ్య గంగులుకు మొక్కి పొలం కొనేందుకు డబ్బు కావాలన్నడట-గంగులు అనుగ్రహించాడు అంతే! చూస్తుండగానే రామయ్యను దేవి కటాక్షించింది లక్ష్మీ పుత్రుడైనాడు రామయ్య ''

నాకు శ్రీపురం మీద భక్తి ఇనుమడించింది "అందుకనేనా రామయ్య ఇంత త్వరగానే పొలం కొనేయ గలుగుతున్నాడు'' అన్నాను-

''ఔను-అంతే కాదు-గంగులు ఆజ్ఞ లేనిదే ఎవ్వరూ ఆలయమూర్తులను దర్శించకూడదు దేవితో ఏమిచెప్పాలన్నా గంగులు ద్వారానే యాత్రికులు మనవి చేయాలి అమ్మవారు గంగులుకు పరుసవేదివిద్య ప్రసాదించిందిట వాడు మట్టి పట్టుకున్నా బంగారమై పోతుందట రావుగారూ ''

నమ్మ బుద్ధికాలేదు నాకు-నమ్మకుంటే తప్పేటట్లు లేదు

"హనుమంతరావుగారూ మనమొక సారి సాయంత్రం శ్రీపురం వెళ్దామా" అన్నాను. ఆయన సరేనన్నాడు.

ఇద్దరమూ తాడికొండ నుండి బస్సులో బయలుదేరి పరిమిదగ్గర దిగాము-

యువ

నాకు తొలిప్రయాణం గుర్తుకొచ్చింది.

సరిగ్గా అదేసమయం—అదేనడక.

"ఎక్కడికి పోతున్నారు హనుమంత రావుగారూ" పరిమిలో ఎవరో ప్రశ్నిం చారు—

"శ్రీపురం దాకా- వీరు రావుగారని. మాకు కావలసినవాళ్ళు—హైదరాబాదులో వుంటారు—"

"అట్టాగా— ఏంగిరాకీ— శిలపాలు చూడడానికేంటి—ఇప్పుడు లాభంలేదండీ ఓ రెండునెల్లదాకా" అన్నాడు రైతు.

"ఏం?" ప్రశ్నించాను నేను.

"గంగులు. ఎవ్వరూ చూడకూడదని చెప్పాడుగా—అందుకని"

"ఏం ఎందుకని చూడకూడదు?"

"అమ్మవారికి ఏకాంతసేవలు జరుగు తున్నాయిగా అందుకని" అని రైతు ఆ సేవలగూర్చి వివరించాడు. ఆలయంచుట్టూ పరదాలు కట్టి గంగులు అహోరాత్రాలు అలా పూజలు చేస్తూనే వుంటాడట ఒక్కడే. ఊళ్లోవాళ్ళు కాదు సరికదా అయన కుటుంబంలో సభ్యులు కూడా వెళ్ళి గంగుల్ని పలకరించడానికి వీలు లేదుట—అంతేకాదు.

రాత్రి పన్నెండు దాటిన తర్వాత ఆలయంలోనుండి ఉలిశబ్దాలు విన్పడుతూ వుంటాయట—అమ్మవారు అప్పుడువచ్చి శిధిలమైన మూర్తులకు ప్రాణం పోస్తు న్నదట—

నేను నిర్వీణుడినై పోయావింటున్నాను.

హనుమంతరావు కూడా అన్నాడు "తాడికొండవాళ్ళకు తెలిదే ఈ విషయం'

"ఆఁ-ఆఁ-" అన్నాడు రైతు చుట్ట నుసి రాలుస్తూ-ఇంక మేమక్కడ నిలబడ లేదు. చకచకా శ్రీపురంకేసి నడిచాము కాలువ అరికాళ్ళు కూడా సరిగ్గా తడవడం లేదు-తేలికగానే శ్రీపురం చేరాము-

అదే వూరు-అదే ప్రకృతి-


కాని మానవ ప్రకృతిలో మాత్రం మార్పు కన్పడింది. వెనకటివలె మమ్మల్ని వింతగా ఎవరూ చూడటం లేదు-నావంటి అనేకమంది యాత్రికులకు వాళ్ళు అల వాటుపడ్డట్లు కన్పడుతున్నది-అసలు మారా కనే పట్టించుకోలేదెవడూ-

నేరుగా రామయ్య ఇంటికి పోయి నాము రామయ్య తన గుడిసె పక్కనే ఓ పెంకుటిల్లు కట్టిస్తూ నిలబడివున్నాడు. అమ్మవారి మహాత్మ్యన్ని తొలిసారిగా అప్పుడే గ్రహించాను-

రామయ్య మమ్మల్ని చూడగానే వచ్చి మంచం వాల్చి తానూ ఓ మంచం వాల్చు కొని కూర్చొని చుట్ట వెలిగించి కబుర్లు మొదలు పెట్టాడు.

రామయ్య మాట్లాడుతున్నాడే కాని మాటల్లో వెనుకటి ఆదరణలేదు—ఆప్యా యతలేదు—"నీలాంటి వాళ్ళను చాలా మందిని చూశానులే" అన్నట్లు ధ్వని స్తోంది ప్రతిమాటా—

రేపు తాడికొండ వచ్చి డబ్బు చెల్లించి రిజిస్ట్రేషను చేసుకొంటానన్నాడు




రామయ్యా—

"మరైతే వస్తా యింక రామయ్యా" అంటూ లేచాను నేను.

"మంచిదండీ" అన్నాడు రామయ్య అంతేకాని మాటవరసకైనా ఉండమన లేదు. మనస్సు కలుక్కుమంది నాకు. ఈ చోటనేనా నేను వెన్నెల వెల్లువలలో ఒక నాటి రాత్రి స్నానం చేసింది?

ఇక్కడేనా ఆప్యాయంగా ఆవకాయా అప్పడాలూ మిరప పండ్లు పోసిన రేగి పచ్చడీ తిన్నాను, నేను?

ఈ ముంగిట్లోనేనా నా కొకనాడు గంధర్వ స్వప్నాలు వచ్చాయి??—

నమ్మ బుద్ధి కావడంలేదు—

రామయ్య గుడి చూద్దాము రమ్మని పిలుస్తాడేమోననుకున్నాను—ఉహూఁ— పిలవలేదు. చివరకు నేనే అన్నాను "రామయ్యా—ఒకసారి ఆ శిల్పాలు చూడాలని వుంది మళ్ళీ" "ఇప్పుడు లాభంలేదండీ—పూజలు జరుగుతున్నా యక్కడ. తడుముకోకుండా సమాధాన మిచ్చాడు నిర్మొగమాటంగా. చాచి నా చెంపమీద ఫెళ్ళున దెబ్బకొట్టినట్లనిపించింది. మరింక మాట్లాడకుండా తిరుగు ముఖం పట్టాను.

నేను కొంచెం ముందుకు నడుస్తున్నాను—

హనుమంతరావు రామయ్యతో కొంచెం వెనుకగా ఏదో మాట్లాడాడు . బహుశా నా తరఫున నా కోసం రామయ్యను బతిమాలుతున్నాడల్లే వుంది—

అవును—అంతే! నా ఊహే నిజం!

రామయ్య తుమ్మతోపుదాటి వెళ్ళి ఓ అయిదు నిమిషాలలోనే తిరిగివచ్చి "రండి గంగులు వప్పుకున్నాడు" అన్నాడు. అందులో ప్రతి అక్షరం వెనుకా "మీరు

కాబట్టి వరం ప్రసాదించాను లేకుంటేనా" అన్న ధ్వని వినిపించింది. నేను యాంత్రికంగా శిల్పాలవైపు నడిచాను, రామయ్యా, హనుమంతరావులు నన్ను అనుసరించారు. వరదాలు దాటి గుడిముందుకు వెళ్ళాను— వాతావరణం వెనుకటిపలె భయంకరంగా లేదు. అంతా పరిశుభ్రంగా ఉంది. చెదిరి పడిన విగ్రహాలన్నీ ఒకచోట చేర్చబడి ఉన్నాయి అయితే నా మనస్సు ఆహ్లాదకరంగా లేకపోవడంవల్ల కావచ్చు తొలినాడు చూచిన అనుభూతి నాకీనాడు కలుగలేదు. అంతా ఏదో నిర్జీవంగా కనిపించింది—

వెళ్ళి గంధర్వులను తాకి చూశాను—

వెనుకటిపలె విద్యుదాఘాతం తగలలేదు నాకు—

నివ్వెరపోయాను నేను—నా మనస్సు పరిపరివిధాలయి పోయింది. ఇంతలో గంగులు వచ్చి మమ్మల్ని చూచి నవ్వాడు పలకరింపుకింద—అంతేకాని నమస్కరించలేదు—

చాలా మారిపోయాడు గంగులు—

విభూతి తెచ్చి మా చేతల్లో పడేశాడు. తీసుకున్నాము ఒకనాడు నా దగ్గర రూపాయి తీసుకోడానికి మొగమాటపడ్డ గంగులేనా యితడు??

"అమ్మవారిపై " హనుమంతరావు నోరు తెరిచి అడిగాడు. "ఇప్పుడు వీలు పడదు" స్పష్టంగా చెప్పాడు గంగులు—తలవంచుకొని మెదలకుండా యివతలకి వచ్చాను నేను. హనుమంతరావూ నన్ను అనుసరించాడు.

ఇరువురమూ చీకటిపడేలోగానే తాడికొండ చేరాము. మరింక ఒకరితో ఒకరం శ్రీపురం గూర్చి చర్చించుకోలేదు. రామయ్య రావడం రిజిస్ట్రేషను పని ముగియడమూ జరిగిపోయాయి. హనుమంతరావుకు కృతజ్ఞతలు చెప్పి సాయంత్రమే గుంటూరు చేరి ఎక్స్‌ప్రెస్‌బస్‌లో మర్నాడు తెల్లవారేసరికి హైదరాబాదు చేరాను. ..

రాత్రంతా నిద్రలేకపోవడంవల్ల అన్నం మాత్రం తిని పగలు మొత్తమూ అలా నిద్రపోతూ నేవున్నాను. సాయంత్రానికి లేచి కూర్చుని కాఫీ తాగుతున్నాను.

ఎవరో తలుపు తట్టారు. లేచి వెళ్ళి తీశాను.

ఒక్కసారి దిగ్భ్రాంతుడినైనాను

"మీరొక్కసారి మాతోరావాలి."

మారు మాట్లాడకుండా వాళ్ళ జీపులో ఎక్కాను జీపు పది నిమిషాల్లోనే బషీర్‌బాగ్ మీదుగా ఫతేమైదాన్ చేరింది. ఇన్‌స్పెక్టర్ కుటుంబరావు నాకు తెలిసినవాడే. వచ్చి కరచాలనం చేసి లోపలికి తీసుకెళ్ళాడు. అక్కడ ఒక వ్యక్తిని పరిచయం చేసి 'వీరు బొంబాయి నుండి మీకోసం వచ్చారు సి. ఐ. బి. అధికారి. మిమ్మల్నేవో ప్రశ్నలు వేస్తామంటున్నారు అన్నాడు

నేను ఊపిరి బిగబట్టి కూర్చున్నాను. కుటుంబరావు ఓ కప్పు చాయ్ నాకు అందించారు

''మీరు శ్రీపురం ఎన్నిసార్లు వెళ్లారు? ఆయన ప్రశ్నించాడు

' రెండుసార్లు—గత ఆగస్టులో ఒక సారి. మళ్ళీ మొన్న ఒకసారి. నేనే శ్రీపురం శిల్పాలపై తొలిసారి ఆంగ్ల వ్యాసం ప్రచురించాను. మొన్న వెళ్ళి నప్పుడు మీ రక్కడ గంధర్వుల శిల్పాలు రెండు చూశారా!

''ఆఁ—చూశాను—''

''అయితే తొలిసారి చూచినవీ, ఇవీ ఒక్కటేనని మీరు చెప్పగలరా?

ఒక్కక్షణం ఆగి అన్నాను ''విగ్ర హాలు అలాగే ఉన్నాయి రెక్కలులేకుండా కాని నా కెందుకో వాటిలో తొలినాటి జీవకళ కన్పించలేదు ''

''దటీస్ ది పాయింట్'' అని బల్ల గట్టిగా చరిచాడు సి. ఐ. బి ఆఫీసరు.

''రేపు మీరు మాతో ఒకసారి బొంబాయి రావాలి. అక్కడ పోర్టులో కస్టమ్స్ అధికారులు రెండు రెక్కలులేని గంధర్వుల శిల్పాలను విదేశాలకు ఒక ముఠా చేరవేస్తుండగా పట్టుకున్నారు. అవే అసలు మీరు ఆగస్టులో చూచిన విగ్రహాలవీ. మొన్నసాయంత్రం చూసినవి డూప్లికేటులనీ నిరూపించగలిగితే మేము చాలా కృతజ్ఞులం—ఆర్కియలాజికల్ డిపార్టుమెంటును కూడా సంప్రదించా మనుకోండి.

''నేను తప్పకుండా వస్తాను - అయితే గంగులూ, రామయ్య .''

''ఆ ముఠాలో సభ్యులుగా చేరారు. డబ్బు తీసుకొని కృష్ణా నదిమీదుగా విజయవాడ చేరుస్తున్నారు శిల్పాలు వీళ్ళు. అక్కడినుండి లారీలలో బొంబాయికి ట్రివేంద్రముకూ చేరవేస్తున్నది ఆ ముఠా. మీరు వ్రాసిన ఆంగ్ల వ్యాసమే దీనికంతా మూలకారణం-అదే విదేశీయుల దృష్టి నాకర్షించింది ''

''కళోద్ధరణ-కళాపోషణ - కళాకైంక ర్యంపై, రవీంద్రభారతిలో ప్రముఖుల ప్రసంగాలు-'' ఎదురుగా టేబిల్‌మీది దిన పత్రికలో ఓ ప్రముఖవార్తనాదృష్టి నాకర్షిం చింది.

